# చీకటిలో చిరుదివ్వెలు

'అరుంధతీ ఫైనాన్స్ కార్పొరేషన్'కు అల్లంత దూరంలో బస్స్టాపు దగ్గర నిలబడి ఆరగంట సేపటినుంచీ సిటీ బస్సుకోసం వేచి చూస్తున్నాడు శివరామయ్య. వేసుకున్న చెప్పులు బాగా అరిగిపోయినా, విశ్వాసాన్ని మాత్రం వదులుకోకుండా కాలిన పెనములా చుర్రుమంటున్న పేవ్మెంటు బారినుంచి అతణ్ణి కాపాడగలుగుతున్నాయి. చేత గొడుగుగానీ, భుజంపైన తుండుగుడ్డగానీ లేకపోవడంవల్ల బట్టతలకు మాత్రం రక్షణలేకపోయింది. అయినా భగవంతు డీయాతనా శరీరమిచ్చింది బాధల్ని భరించడానికేనన్న వైరాగ్యభావం ఒకటి ఈ మధ్య శివరామయ్యలో బలపడిపోయింది. 'కావలిసిందే, యిలా కావలిసిందే' నన్నట్టుగా చెమటలు దిగజారిపోతున్నా లెక్క పెట్టకుండా, పాతగిల్లి ఒకచోట నెర్రెగూడా పడిన సులోచనాలలో నుంచీ ఆయన రోడ్డువైపు పారజూస్తున్నాడు.

వాకబు చేయగా తెలిసింది, తానిక్కడికొచ్చి నిల్చోడానికొక అయిదు నిమిషాలు ముందుగానే ఒక బస్సు(12.ఇ.) యిలా వెళ్ళిపోయిందట!

నెక్స్టు బస్సు రావడమనేది, వేచివుండేవాడి అదృష్ట దురదృష్టాలపైన ఆధారపడిన సంగతి.

భూతాల్లాంటి లారీలు, తూనీగల్లాంటి కారులు, ఇంకా సైకిళ్ళు, రిక్షాబళ్ళు అవతలేవో రాజ్యాన్ని పట్టుకోదలచినట్టుగా ఎక్కడంటే అక్కడ రోడ్డును క్రాసు చేయడానికి వురికి వస్తున్న మనుషులు, హారన్ సవ్వళ్ళు, 'తప్పుకో, తప్పుకో' చప్పుళ్ళు, తారు రోడ్డు ఆవేళప్పుడు గూడా పోటెత్తిన సముద్రంలాగే వుంది.

హోటల్ ఎవరెస్టునుంచి సుష్టుగా తిని ఈవలికొచ్చి బుగ్గనిండా కారాకిళ్ళీ దట్టించి, సిగరెట్టు ముట్టించుకుంటున్న వాళ్ళ పాలిటికి ఆ మధ్యాహ్నపు మండుటెండ సైతం వెన్నెల్లాగానే వుంది.

భోజనాల కోసం యిళ్ళకు వెళ్ళిన పిల్లలు పరుగుపరుగునా స్కూళ్ళవైపు పరుగెడుతున్నారు.

బంకుల్లో, చిల్లరంగళ్ళలో, బట్టల షాపుల్లో వ్యాపార సాపారాలు నిరాఘాటంగా సాగిపోతూనే వున్నాయి.

ఎటొచ్చీ ఆ మహాసంరంభంలో తన జీవనరథమొక్కటే కదలనంటే కదలనని మొరాయించుకుపోయినట్టు తోస్తూవుంది శివరామయ్యకు! ఎలాగైనా దీన్ని మళ్ళీ కదిలించాలన్నదే ప్రయత్నం, వట్టి ప్రయత్నమా, విశ్వప్రయత్నం!

తానిక్కడికొచ్చి నిల్చున్న తర్వాత కొద్దిసేపటికే పదహేడో నంబరు బస్సు వచ్చి వెళ్ళిపోయింది. దాన్ని తరుముకుంటూ 11-సి వచ్చింది. ఆపైన 6,21,33డి. యింకా ఏవేవో బస్సులు రానూవచ్చాయి, ఆగి యెక్కేవాళ్ళ నెక్కించుకుని వెళ్ళిపోనూ వెళ్ళిపోయాయి. 12-ఇ జాడ మాత్రమే కానరావడం లేదు.

శివరామయ్య తేరిపారజూస్తున్న రోడ్డు వున్నట్టుండి కొద్ది క్షణాలపాటు ప్రయాణ వాహనాలేవీ లేకుండా బోసిపడిపోయింది. ఆ తెరిపిలో ఆఘమేఘాలపైన దూసుకొస్తూ ఓ మోటార్ సైకిల్ కనిపించింది. కాలాన్నీ, దూరాన్నీ జయించే కిటు కేదైతేవుందో

అది తనకొక్కడికే తెలిసినంత ధీమాగా ఓ యువకుడు దానిపైన కూచున్నాడు. మరీ దగ్గరగా వచ్చేటంతవరకూ మోటార్ సైకిలు వైపు నిర్వికారంగానే చూస్తూ వుండిపోయిన శివరామయ్య యువకుడి భుజంపై నుంచీ తళుక్కుమన్నట్టుగా కానవచ్చిన ఓ ముఖాన్ని చూచి త్రుళ్ళిపడకుండా వుండలేకపోయాడు.

అంతలో మోటర్‌సైకిలు శివరామయ్యను దాటుకుని ముందుకు సాగిపోయింది.

వెనుక సీటుపైన కూర్చున్న అమ్మాయి గూడా మెడత్రిప్పి శివరామయ్యవైపు చూచింది.

ఆ చూచిన క్షణంలో ఆమె కనురెప్పలు టపటపా కొట్టుకున్నాయి.

శివరామయ్య పళ్ళు బిగ్గరగా కొరుక్కున్నాడు.

ఆమె పైపంటితో క్రింది పెదవిని నొక్కి పెట్టుకుంది.

శివరామయ్య కళ్ళల్లో ఎర్రటి జీర ప్రాకింది.

గిరుక్కున ఈవలికి తిరిగి ఆయన పెడముఖం పెట్టేశాడు.

చప్పుడు లేకుండా ఓ బస్సు వచ్చి ఆగింది. తానెక్కవలసిన బస్సే, ఎక్కి కూచున్నాడు.

అసలే మనసులో అలజడిగా వుందేమో, రోడ్డుపైన ఆ దృశ్యం కానవచ్చిన తర్వాత అది కాస్తా తుపానుగా మారిపోయింది.

– స్వంతంగా వీడికొక మోటర్ సైకిల్ ఏడ్చిందా? రిపేరు కొచ్చి వుంటుంది. దర్జాగా దానిపైన బైటాయించేశాడు. సిగ్గులేకపోతే సరి! వాడికి లేకపోతేపోయింది...ఛీ ఛీ! ఈ పిల్లకైనా బుద్ధి వుండొద్దూ? మతిమాలి బురదలో కాలు వేసింది చాలక, వాడి వెనకాల కూచుని ఊరేగడం కూడానా!

తన స్పృహతో తాను యింటికి వెళ్ళాడనడంకన్నా, ఎక్కడ దిగాలో అక్కడ దిగడానికి, ఏవైపుగా నడవాలో ఆ వైపుగా నడవడానికి ఆలవాటుపడిన పాదాలు శివరామయ్యను యింటికి చేరవేశాయని చెప్పడం సబబుగా వుంటుంది.

భర్త కోసం వేచి చూస్తున్న పార్వతమ్మ వంటగదిలోకి వెళ్ళి మంచి నీళ్ళ గ్లాసుతో ఎదురొచ్చింది. ఏమిటోగావున్న భర్తవాలకాన్ని గమనించి తికమకపడిపోతూ “వెళ్ళిన పనేమైందండీ? కాయా, పండా?” అని ఆతురతగా ప్రశ్నించింది.

శివరామయ్య భార్య ముఖంలోకి అయోమయంగా చూచాడు. హఠాత్తుగా ఏదైనా చెప్పాలనిపించడంతో “పండేలేవే పార్వతీ, పండే!” అన్నాడు. ఈ జవాబులో ధ్వనించిన నైరాశ్యాన్నిగానీ, చిరాకునుగానీ పార్వతమ్మ ఖాతరు పెట్టే స్థితిలో లేదు. “పండేగదా? చాలు చాలంతే చాలు” ననుకుంటూ ఆమె సంతృప్తితో నిట్టూర్చింది.

అటూ యిటూ కలయజూచి ఇంట్లో శర్వాణి లేదని తేల్చుకున్న తర్వాత శివరామయ్యకు మనసు విప్పి మాట్లాడే అవకాశం లభించింది – “ఏం, తేరగొచ్చి మన చేతిలో పడిందా పండు? పాతిక వేలు చేసే యిల్లు తాకట్టు పెట్టుకుంటా రేమో, పదిహేను వేలిప్పిస్తారేమో? నూటికి నెలకు వడ్డీ ఒకటిన్నర రూపాయ మాత్రం. ప్రతి నెలా వంద రూపాయలు చెల్లించుకోవాలి. ఆ లెక్కన మనం ఎంచక్కా హాయిగా బ్రతికినంత కాలమూ అప్పులు కట్టుకుంటూనే వుండొచ్చు. మధ్యలో మానేస్తామనుకో, వాళ్ళింటిపై కొస్తారు. జప్తు చేస్తారు. వాళ్ళకు రావలసింది వాళ్ళు తీసుకుంటారు. మిగిలింది మన ముఖాన పారేస్తారు...”

"బాబ్బాబూ, మీకు పుణ్యముంటుంది! ఈ మాటలు బయటికెక్కడైనా చెప్పేరు? పిల్లలు దిగులుపడిపోతారు" అంది పార్వతమ్మ.

వేళ తప్పిన భోజనంవల్ల శివరామయ్యకు అలసట ముంచుకొచ్చింది. వాలు కుర్చీలోకి సోలిపోయాడేమో, సొమ్మసిల్లినట్టుగా నిద్రపోయాడు. టైప్‌రైటింగు ఇన్‌స్టిట్యూటు నుంచీ శర్వాణి ఎప్పుడొచ్చిందో తెలియదు. శివరామయ్యకు మెలకువ వచ్చేసరికి ఆమె తల్లికి దేన్ని గురించో వివరిస్తూ కలకలా నవ్వుతూ వుండడం వినిపించింది.

శివరామయ్య నిద్రలేవడం గమనించి శర్వాణి కాఫీచేసి తీసుకొచ్చింది. గ్లాసు చేతి కందుకుంటూ శివరామయ్య కుమార్తె వైపు చూచాడు... సందేహం లేదు. శర్వాణి అందాలబొమ్మే! సుగుణాల రాశిగూడా! పట్టుబట్టి ఇంటరుతో ఆపించేశాదుగానీ లేకుంటే ఆమె చదువుల సరస్వతి అయ్యేది కూడా! కానీ ఏం లాభం? అదనంగా కట్నాలు, లాంఛనాలు, పెళ్ళిళ్ళ ఖర్చులు లేకపోతే ఆడపిల్ల కేవలం ఆడపిల్లగానే చలామణి కావడానికి వీల్లేని ఈ పాడులోకంలో మిగిలిన యోగ్యతలెన్ని వుంటే ఏం చేసుకోను?

కాఫీ త్రాగి ప్రక్క వీధిలోవున్న రీడింగు రూముకు వెళ్ళిన శివరామయ్య చీకటి పడిపోయాక యింటికి తిరిగి వచ్చాడు.

ఇప్పుడు గృహ వాతావరణం ఇంకొక రకంగా వుంది.

కాలేజీ నుంచి వచ్చిన సుజాత పుస్తకాలు టేబిలుపైన పడివున్నాయి. శర్వాణి షార్ట్‌హాండ్ సాధనచేసే నోట్ బుక్ గూడా అదే టేబిల్ పైన ఎలా బోర్లించి పెట్టిందలాగే వుంది. తల్లీ కూతుళ్ళు ముగ్గురూ వంటగదిలో కూర్చుని ఆదేపనిగా గుసగుసలు పోతున్నారు.

పట్టినంతసేపు ఓపికపట్టి ఆఖరుకు శివరామయ్య ఆడగనే అడిగాడు: "ఏమిటది పార్వతీ! ఎంతసేపైనా మీలో మీరు చెవులు కొరుక్కొంటే సరిపోయిందా? ఆ విశేషం కాస్తా నా చెవిలోనూ వేయరాదూ?"

పార్వతమ్మ తక్కుతూ తారుతూ హాల్లోకైతే వచ్చిందిగానీ, ధీమాగా భర్త ఎదుటకుమాత్రం రాలేకపోయింది. ఉరుములకు, పిడుగులకు భయపడిపోయే పూరేడి గువ్వలా గోడదాపున ఒరిగి నిల్చుంటూ, జంకుగొంకులతోనే విశేషాన్ని బయట పెట్టింది.

"ఏమండీ! మధ్యాహ్నం మీకు రోడ్డు మీద పెద్దమ్మాయి కనిపించిందటగా! నాతో చెప్పనేలేదే?"

శివరామయ్య ముఖం కందగడ్డలా జేవురించింది. కళ్ళు నిప్పుల్లా ఎరుపు వారిపోయాయి. ఆ బలహీనమైన శరీరం అంతలావు కోపాన్ని యిముడ్చుకోలేక కొలిమితిత్తిలా రొప్పడం మొదలెట్టింది.

పార్వతీ! బుద్ధీ, జ్ఞానం వున్నదానివయితే నువ్విలా మాటాడవు. రోడ్డుపైన నాకెందరో కనిపిస్తారు. కనిపిస్తే? నాకున్నదల్లా యిద్దరు బిడ్డలేనని ఎన్ని సార్లు చెప్పాను నీతో? ఇంకొకసారి అలా అన్నావో, మాటదక్కదు. మళ్ళీ నేను చెప్పలేదనుకోవద్దు.

"నాకెందుకొచ్చింది బాబూ! విశేషమేమిటనీ అడిగితే చెప్పాలిసొచ్చింది." పార్వతమ్మ కళ్ళనిండుకూ నీళ్ళు నిలిచాయి. కూతురెక్కడైనా దూర ప్రాంతములో వుంటే ఆ సంగతి వేరు. ఇదే పట్టణంలో వున్నా తానామెను తన పాపంచేసిన కళ్ళతో చూచి

నాలుగేళ్ళయింది. లక్షణంగా తన కాపురమేదో తాను చేసుకపోతున్న అమ్మాయిని పట్టుకుని ఈయన చచ్చినదానిక్రింద జమకట్టడం ఆమెగుండెపైన రంపపు కోతలా పనిచేసింది. ఆ ఉక్రోషంలో మిగిలిన వర్తమానాన్నంతా ఒక్క గుక్కలో వెళ్ళబోసుకునేదాకా ఆమె వూపిరి త్రిప్పుకోలేకపోయింది.

"మమతలన్నీ తెగ్గోసుకుని బ్రతికి వున్నదాన్ని చచ్చిందిగా చెప్పుకోడానికి మీకైతే చెల్లింది! ఆ పిచ్చిపిల్ల ఈ రోజు సాయంకాలం కాలేజీకొచ్చిందట. 'నాన్నగారలా చిక్కిపోయారేమే?' అని సుజాతనడిగిందట. మధ్యాన్నమైతే మీరు పేవ్‌మెంటుమీద నిలబడివున్నారట. ఎండకు తల కాలిపోతోందట. ముఖమంతా చెమటేనట. పాపం, దాని మనసెంత విలవిలలాడి పోయిందో! సరాసరి ఆఫీసు నుంచే కాలేజీ కొచ్చేసింది. పోనీలెండి బాబూ, ఇకమీదట దాని వూసెత్తితే ఒట్టు...'

పార్వతమ్మ ఈ రాత్రికిక భోజనం ముట్టదని శివరామయ్యకు తెలుసు. మనసు నొచ్చే సంఘటన జరిగినప్పుడు తనపైన తాను ఉపవాసాన్ని శిక్షగా విధించకోవడం ఆమె కలవాటు.

శర్వాణి వడ్డించగా శివరామయ్య గూడా అరకొరగానే తిన్న శాస్త్రం ముగించాడు. గాలికూడా కదలకుండావున్న స్తబ్ధతలో మరేం చేయడానికి పాలు పోక తొమ్మిది కాకముందే పడుకున్నాడు. కదలిక లేకుండా శరీరాన్ని అదుపులో పెట్టుకోడం సులభమే! కానీ మనసు మాట? సముద్రపు హోరులాంటి ఆవేదన ఏదో ఆయన మస్తిష్కంలో రొద పెట్టడం ప్రారంభమైపోయింది.

మౌనంగా సాధించడంకన్నా పార్వతి తనతో పోట్లాడివున్నా బాగుండేది. ఏ వూసయితే ఎత్తనంటూ ఆమె ఒట్టేసుకుందో, ఆవూసిప్పుడు తన మనసులో లోతుల్లోకి తొలుచుకపోతోంది.

స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాసిన శ్రీలేఖ 'నా నెంబరు ఫస్టు క్లాసులో వచ్చింది నాన్నా!' అన్నప్పుడు తాను వులిక్కిపడ్డట్టుగా తెల్లబోయాడు. ఆ తరువాత ఆమె స్కూలుకంతా ఫస్టొచ్చినట్టు తెలిసినప్పుడు నిజంగా తన గుండెలవిసిపోయాయి. ఆమె చదువులకోసం తాను ఖర్చుపెట్టవలసిందేమీ వుండదనీ, తన స్కాలర్‌షిప్పుతోనే నెగ్గుక రాగలదనీ తెలిపోయినతర్వాత ఆమెనిక కాలేజీమెట్లెక్కకుండా వారించలేకపోయాడు. అందుకు ఫలితంగా, డిగ్రీ ఆమె చేతికి రావడం!

వయసు రావడంతోబాటు, చదువుగూడా ముగించిన అమ్మాయికిక పెళ్ళి చేయడమేగదా తరువాయి!

పెళ్ళిళ్ళ మార్కెట్టనే మడుగులో ఎంతెంతలేసి తిమింగలా లుంటాయో తనకప్పుడే తెలిసింది.

వరుడు బియ్యేదాకా చదువుకున్న వాడైతే పదివేలు. లెక్చరరయితే పదిహేను, ఇంజినీరయితే పాతిక, డాక్టరయితే అరలక్షదాకా వున్నాయి రేట్లు!

ఆకాడికీ తానేమైనా వూరుకున్నాడా? తన ప్రయత్నాలేవో తాను చేస్తున్నాడు. కానీ ఆ పిల్లలకు తన ప్రయత్నాలపైన నమ్మకం లేకపోయింది. ఆమె తన సమస్యలకు పరిష్కారంగా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసునే నమ్మింది. ఉద్యోగం దొరికిన తర్వాత ఉదయాల్లో ఆఫీసుకు వెళ్తూవెళ్తూ, సాయంకాలాల్లో యింటికి తిరిగి వస్తూవస్తూ వుంది. ఈ లోగా తాను గూడా శక్తివంచనలేకుండా వరాన్వేషణ చేస్తూనే వచ్చాడు.

కుదిరినట్టేతోచి, అందినట్టే స్ఫురించి, యింకెంత అతికినట్టే ననిపించి ఎన్నో సంబంధాలు చిట్టచివరకు నీటిలో కట్టిన మూటలైపోతూ వచ్చాయి.

ఇంతలో ఆ పిల్లగూడా తన కొంప ముంచేసింది.

'బియెస్సీ'లో రాంకు తెచ్చుకున్న శ్రీలేఖ 'చదువరి' అని చెప్పుకోడానికి వీల్లేని ఓ మోటారు మెకానిక్కును పెళ్ళాడేసింది. అది రిజిష్టరు పెళ్ళి. (దొంగ పెళ్ళికి మారుపేరు!) వరుడి కున్నదల్లా ఒకటే అర్హత - దమ్మిడీ కట్నమైనా ఆశించకపోవడం!

పార్వతివైపు నుంచీ దూరపు బంధుత్వమేదో వుండి ఏడ్చిందట! అప్పుడప్పుడూ యింటికొచ్చి వెళ్ళేవాడు. ఆ పరిచయమే అమ్మాయినిలా గోతిలోకి దించేసింది.

పరిచితుల్లో, బంధువుల్లో, సమాజంలో తాను మళ్ళీ తల ఎత్తుకుని తిరగడం దుస్తరమని అప్పట్లో అనిపించింది.

కానీ ఇందును గురించి పార్వతి వాదం వేరు.

"అన్ని హంగులతోనూ పెళ్ళికార్యం పూర్తిచేయడానికి ఎంతలేదన్నా పదిహేను వేలు కావలసొచ్చేది. అప్పుడైనా మనం అప్పుచేసేవాళ్ళమే గదా! అమ్మాయి ఆ అప్పులభారం నుంచీ మనల్ని కాపాడింది. ఇందులో అది మనకు చేసిన కీడేముందండీ?" అంటుంది పార్వతి.

తన స్నేహితుల్లో రంగనాథమని ఒకతనున్నాడు. బాగా చదువుకున్న మనిషి. అతడైతే తన పెళ్ళిద్వారా శ్రీలేఖ నారీ లోకానికొక ఆదర్శాన్ని చూపించిందనేటంత వరకూ వెళ్తాడు- "అయ్యా శివరామయ్యా! బుంగముఖం పెట్టి ఈ నంగి మాటలు నాతో చెప్పొద్దు. మనమున్నది పంతొమ్మిదో శతాబ్దంలో కాదు - ఇది ఇరవయ్యో శతాబ్దం. ఒకప్పుడు ముండమోపికి పెళ్ళి చెయ్యడమనేది ఘోరమైన అపరాధం. అయిదేళ్ళ పసిపాపను ఇప్పుడైనా పాతికేళ్ళ మగాడికిచ్చి పెళ్ళి చేస్తున్నారని తెలిస్తే ఊరంతా ఒకటిగాచేరి వాళ్ళమానం కడిగేస్తారు. వీరేశలింగంలాంటి మహానుభావులు పూనుకోబట్టి మనం ఒకడుగు ముందుకు వేయగలిగాము. మూఢాచారాలనే ముళ్ళపొదలు ఛేదించాలంటే వట్టిమాటలు సరిపోవు. ఇంత తెగువ, ఇంత సాహసం వుండాలయ్యా! అది వుంటేనే మనిషి. లేకపోతే నడపీనుగు. వరకట్నమనే దురాచారం మన కుటుంబవ్యవస్థను మహమ్మారిలా పీడిస్తోందని ఎవరికి తెలియదు? వ్యాసాల్లోనూ, ఉపన్యాసాల్లోనూ దాన్ని చీల్చి చెండాడితే సరిపోయిందా? చేతల దగ్గరకొచ్చేసరికి లాలూచీ బేరాలు! నన్నడిగితే మీ అమ్మాయి భేషైన పనిచేసింది. కట్నం కోరుకునే విద్యాధికుణ్ణి దగాకోరుగా పరిగణించి, కట్నం కోరని కార్మికుణ్ణే వరించింది. ఏం, మేధావులకు అక్షరజ్ఞానం లేని భార్యలుండలేదా మన సమాజంలో? మీ అమ్మాయి ఎన్నికలో అంతపెద్ద విపర్యాయమేమీలేదే?"

ఏది ఏమైనా, ఎవరేమి చెప్పినా తనకు మాత్రం తీరని అవమానమేదో జరిగినట్టే వుంది....

శివరామయ్య ఒత్తిగిల్లి పడుకున్నాడు.

పక్కింటి గోడగడియారం పదిసార్లు మ్రోగింది.

గడియారంలోని గంటల సవ్వడిని వెన్నంటినట్టుగా వీధి తలుపుపైన టక్కుటక్కుమని చప్పుడు వినిపించింది.

వీధివైపు గదిలో పడుకున్న సుజాత 'ఎవరూ?' అంటూ లేచివచ్చి హాల్లో లైటు వేసింది.

మళ్ళీ తలుపుపైన టక్కుటక్కుమన్న శబ్దం.

"ఎవరో చూడమ్మా?" అన్నాడు శివరామయ్య.

"ఎవరంటే పలకరే?" విసుక్కుంటూ తలుపు తెరిచిన సుజాత, ఆశ్చర్యంతో ఓ అడుగు వెనక్కు వేసింది.

ఆలోగా "ఎవరే తలుపు తట్టింది?" అంటూ హాల్లో చాపపైన పడుకున్న పార్వతమ్మగూడా లేచి కూర్చుంది.

నిశ్శబ్దంగా కదిలే నీడలా వీధి మెట్ల పైన్నుంచే హాల్లోకి వచ్చింది శ్రీలేఖ.

రెప్పపాటులేని కళ్ళతో కుమార్తెవైపు చూస్తూ కొద్దిక్షణాలవరకూ పార్వతమ్మ నిశ్చేతనంగా వుండిపోయింది.

ఎండుటాకుల్లా చలించిన పెదవుల పైన్నుంచీ ఆఖరు కెలాగో మాటలు వెలువడ్డాయి:

"ఎంతకాలానికొచ్చావు తల్లీ? ఇన్నాళ్ళకు నేనొకదాన్ని బ్రతికున్నానని గుర్తొచ్చిందా?" ఆమె గుండెలోని దుఃఖం ఒక్క పెట్టున కట్టలు త్రెంచుకుని బయటపడింది.

ఇంతలో తల్లి ప్రక్కన్నే చాపపైన పడుకున్న కల్యాణి కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుని శ్రీలేఖ కనిపించగానే సుడిగాలిలా లేచివచ్చి, "అక్కయ్య మనింటికి రాకుండా ఎక్కడికి పోతుందే అమ్మా?" అంటూ బిగ్గరగా కావలించుకుని అక్కగారిని వుక్కిరిబిక్కిరి చేసేసింది,

"ఒక్కదానివే వచ్చావేమక్కయ్యా? బావను పిలుచకరాలేక పోయావా?"

"ఏమిటే శార్వాణీ, మీరెంతగా కాదనుకున్నా ఆయన ఇంటల్లుడుగాక పోతాడా? అభిమానముండదూ, నన్నీ వీధి చివర పార్కుదాకా తీసుకొచ్చి అక్కడే ఆగిపోయారు."

"నువ్వు తిరిగివెళ్ళేటంత వరకూ బావ అక్కడే వుంటాడా అక్కయ్యా?" చిన్నపిల్ల సుజాత అమాయకంగా అడిగింది.

"నేనుగూడా తొందరగానే వెళ్ళిపోతానమ్మా! ఒక మాట చెప్పిపోదామని వచ్చాను..." తల్లివైపు చూస్తూ కొనసాగించింది శ్రీలేఖ. "నీకు తెలియందేమీ కాదమ్మా? నాన్నగారు దిగిపోయారు. మధ్యాహ్నం మండుటెండలో ఫైనాన్స్ కార్పొరేషన్ దగ్గర ఆయన్ను చూచినప్పటి నుంచీ నాకు మనసు మనసులో లేదు. ఉడిగిన వయసులో ఈ యిల్లుగూడా లేకపోతే మీరెవరి పంచలో తలదాచుకుంటారమ్మా? నేను మీ అల్లుణ్ణి అడిగే చెబుతున్నాను. మా దగ్గర పదివేలు ఉన్నాయి. ఇవ్వగలిగితే మాకే తిరిగి యివ్వొచ్చు. పెళ్ళికోసమని అప్పులు మాత్రం చేయొద్దు...."

కూతురి ప్రతిపాదన చెవిలో పడిగూడా పడనట్టు పార్వతమ్మ ఖిన్నవదనంతో నేలవైపు చూస్తూ వుండిపోయింది,

రెండు నిమిషాలు మౌనంగా గడచిపోయిన తర్వాత "అక్కయ్య అడిగిందానికి బదులు చెప్పకుండా అలా కూచున్నావేమమ్మా?" అంటూ సుజాత తల్లిని కదిపి చూచింది.

"నేనేం చెబుతానమ్మా, నామాటేం సాగుతుంది?" తేల్చేసింది పార్వతమ్మ.

గదిలో పడుకున్న శివరామయ్యలో మట్టుకు చలనం లేదు.

ఉండి ఉండీ తటాలున శ్రీలేఖ చేతిలో చేయివేసి వాగ్దానం చేస్తున్నట్టుగా అంది శర్వాణి- "బావిలో దూకి అయినా చస్తానుగానీ కట్నం యివ్వవలసి వచ్చె పెళ్ళికి మాత్రం ఒప్పుకోను. మార్చిలో టైప్‌రైటింగు పరీక్షలయిపోతాయి. అక్కయ్యా! నాకో ఉద్యోగం చూచి పెట్టవూ?"

జీవిత రంగస్థలంపైన జీవిస్తున్న - జీవించవలసివున్న పాత్రలకు తమ జీవితాన్ని దేశ కాల పరిస్థితులకు అనుగుణ్యంగా మార్చుకునే హక్కుంటుందనే సత్యం చీకటిలో చిరుదివ్వెలా శివరామయ్య బుర్రలో మెరిసినట్టయింది - అన్న మాటతో ఈ కథను ముగించడానికి వీల్లేదు. ఆయన గుర్తించకపోయినంత మాత్రాన ఈ సత్యానికి వచ్చే సేగి యేమీలేదని మాత్రం చెబుతే చాలు!

'స్వాతి' మాసపత్రిక, **1982**